

''ఓరే రావసిలకడూ నీ గొర్రెలు పారిపోతుండాయిరా! నేను ఇజీనారం సరుకుల కెల్లొత్తుంటే కొత్తపేట కాడవుపించినాయి!'' అన్నాడు పెంటుగాడు భుజం మీదుగా వెనక్కి వేలాడుతున్న గుడ్డ మూట సర్దుకుంటూ.

గుడిసె రాటకి కాలు దన్నుపెట్టి, పెయ్యికి పలుపు తాడు పేనుతున్న రావచిలకడు, నోట్లో వున్న చుట్టను తీసి తుపుక్కున వుమ్మి ''ఏట్రా పెంటిగా ఏతంతన్నవ్? నా గొర్రెలు పారిపోతుండాయా? వోరివి సూసి వోరివనుకున్నావో? మా సెందిరి గుంట పెందిలికాడ మేతకు తోలుకు పోయిందోరి!'' అన్నాడు రావచిలకడు కాస్త నిబ్బరంగా.

పెంటిగాడు కొంతసేపు అలా నిలబడి మళ్ళీ అన్నాడు. ''కాదోరి రావసిలకడూ అయినీయే! ఆటి మెళ్ళో నువ్వాగట్టిన రంగు గుడ్డ పీలికలగుపించినాయి!''

ఒక్క ఉదుటున లేచాడు రావచిలకడు.

చూరు మీదుగా వేలాడుతున్న నాగుల గావంచా తీసి భుజం మీద వేసుకున్నాడు. మూలనున్న చేతికర్ర అందుకున్నాడు.

''ఒలే ఎల్లీ ఆ సెందిరి గుంటాత్తె నాలుగులగించె! నేనిప్పుడే వొత్తా!'' అంటూ వీధిలోకొచ్చి కొత్త పేట వైపు పరుగు లంకించుకున్నాడు.

'ఏటో ఈడూ ఇట్టాటోడే! ఆ గుంటా అట్టాటిదే!' అనుకుంటూ రోట్లో వడ్లు పోసి పోటు వెయ్యసాగింది రావసిలకడి భార్య ఎల్లి.

సూరీడు బాగా మీదికొచ్చాడు. ఎండ చుర్రుమంటోంది. అంతవరకూ పుస్తకం చదవడంలో మునిగిపోయిన చంద్రి ''ఒలే గుంట నంజా గొర్రెలేయే?'' అంటూ ఎదురుగా నిలుచున్న తండ్రిని చూసి గజగజ వణికిపోయింది.

అప్పుడు తండ్రి సినిమాలో రాక్షసుళ్ళా వున్నాడు.

''ఈడే మేత్తుండాయ్!'' అంది నాలుగువైపులా చూస్తూ.

''ఏడే మేత్తుండాయ్? ఏడ?'' అంటూ దాని జుట్టు పట్టుకుని వీపువంచి నాలుగు గుద్దులు గుద్దేడు రావసిలకడు.

చంద్రి కళ్ళల్లో నీళ్ళ ఉబికాయి. తండ్రి కర్కశత్వం దాని మనసు మీద దెబ్బతీస్తూనే ఉంటుంది.

కాని పన్నెండేళ్ళ చంద్రి ఏం చెయ్యగలదు?

దాని ఆలోచనలు వేరు. దాని ఆశలు వేరు. దాని బాటలు వేరు.

వాటన్నిటికీ ఊపిరి పోసినవాడు సత్యం మాష్టారు.

సత్యం మేషారు ఎన్నో చెప్పేవాడు. సత్యం, అహింస, ధర్మం, న్యాయం. ఇవన్నీ ఆ లేత హృదయం మీద బాగా ముద్ర వేసుకున్నాయి.

'తండ్రి తననెందుకు కొట్టి హింసిస్తున్నాడు? అహింస గురించి తండ్రికి తెలీదా?'

చిన్న నవ్వు వెలిగింది చంద్రి పెదాల మీద.

తండ్రికి అదే తెలిస్తే గొర్రెల్ని అంత ప్రేమగా పెంచి పెద్దచేసి వాటిని కోసి మాంసం ఎందుకమ్ముకుంటాడు?

''ఏటే అట్టా రాయినా నిల్సుండిపోయావ్? ఇంటికాడికి పద నిన్నేటి సేత్తానో నాకే తెలవట్లేదు!'' అన్నాడు రావచిలకడు పళ్ళు నూరుతూ.

చంద్రి ముఖంలో నీలితెరలు జారాయి.

మెల్లిగా మాష్టారు పంపిన పుస్తకాన్ని వెనక్కి దాస్తూ లేచి నిలుచుంది.

''ఏటే అది? ఇటియ్యి'' అంటూ దాని చేతులోని పుస్తకాన్ని గిరాటు కొట్టాడు రావసిలకడు ''ఒలే గుంటా నీకు సదూాలు కావల్సొచ్చాయే సదూాలు?'' అంటూ.

ఉక్రోషం ముంచుకొచ్చింది చంద్రికి.

సత్యం మేష్టారు తన మీద ప్రేమతో రెండ్రోజుల కిందట ఆ పుస్తకం పంపించాడు పోస్టులో.

పోస్టుమేన్ వెంకట్రావు తెచ్చి ఇచ్చాడు. అప్పుడు ఇలా అన్నాడు కూడా ''ఒసే చంద్రీ నీకీ మాత్రం జ్ఞానం రావడానికి కారణం ఆ సత్యం మేష్టారేనే! ఇలా గొర్రెల మధ్య పడి వుంటే నీకసలు ఏమైనా తెలిసి వుండేదా?'' అని.

''నిజవే! తనకి అచ్చరాలు నేర్పించి మంచిచెడ్డలు చెప్పిన దేవుడు సత్యం మేట్టారే!''

''ఆయన మాటలు అచ్చర సతేలు!''

''వోర్నీ కట్టపెట్టకూడదు. జీవుల్ని ఇంసించకూడదు! ఏట్నీ సంపకూడ్దు''

''ఏందే గుంటా?'' ఒక్క తోపు తోసాడు రావసిలకడు కూతుర్ని.

పడబోయి నిలదొక్కుకుని మెల్లగా అడుగులు వేసింది చంద్రి.

రావసిలకడి అడుగుల కింద పడి దుమ్ము కొట్టుకుపోయింది సత్యం మేష్టారు పంపించిన పుస్తకం.

కాలిలో ముల్లు గుచ్చుకున్నట్టు నటించిన చంద్రి కళ్ళకి ధూళి కొట్టుకుపోయి నలిగిన పుస్తకం కనిపించింది.

అందులోంచి గౌతమబుద్ధుడు, వివేకానందుడు, గాంధీగారు మొదలైన వాళ్ళంతా తనవైపు జాలిగా చూస్తున్నట్టనిపించింది.

మంచి చెడ్డల్ని, హింసా హింసల్ని బేరీజు వేసుకుంటూ తన గుడిసె వైపు నడిచింది చంద్రి.

★★★

ఆ రాత్రి ఎంతకీ నిద్ర పట్టలేదు చంద్రికి.

గాంధీ, బుద్ధుడు, ఇంకా... ఇంకా గొప్పోళ్ళ బొమ్మలే కనపడుతున్నాయి. రంగురంగుల బొమ్మల పుస్తకం దుమ్ము కొట్టుకుపోయింది. అది ఇప్పుడు అక్కడ ఉందో లేదో?

వెనక్కి తిరిగి తెచ్చుకుందామనుకుంది. కాని అయ్య... తనని బతకనిత్తాడా? అందరయ్యలూ ఇంతేనా? తన అయ్యే ఇట్టాటోడా?

''సదూకుంటానంటే సావగొట్టిండు. మరి తనెట్టా సదవగలుగుతుంది?''

ఒక్కసారి ఆమె అంతరంగంలో సత్యం మాష్టారు మెదిలాడు. 'సత్యం మేట్టారు అనే కంటే దేవుడు మేట్టారంటే బాగుంటాది' అనుకుంది చంద్రి ఎన్నోసార్లు.

సత్యం మాష్టారు ఆ ఊరి బడికి బదిలీ మీద వచ్చాడు.

ఎవర్నయినా పనిపిల్లని చూసి పెట్టమంటే, తనని అప్పగించాడు పోస్టుమాన్ వెంకట్రావు.

రోజూ ఉదయాన్నే సత్యం మేష్టారి పన్లు సరిపెట్టి గొర్రెపిల్లల్ని మేపడానికి పోతూ వుండేది చంద్రి.

ఓ రోజు సాయంకాలం టీకాచి ఇస్తూ వుంటే అన్నాడు సత్యం మాష్టారు. ''చంద్రీ చక్కగా చదువుకోరాదూ!'' అని.

తను తెల్లబోయి తెప్పరిల్లి చూస్తూ అంది ''నాకు సదువోరు సెప్తారు?'' అంది తను.

'నేను చెప్తాను'' అన్నాడు సత్యం మాష్టారు.

అది మొదలు అక్షరాలు నేర్చి పుస్తకాలు చదవడం వరకూ నేర్చుకుంది ఆయన దగ్గర.

ఎప్పుడూ సత్యం మేష్టారు చెప్పే సత్యం ఒక్కటే. సత్యం, అహింస, కారుణ్యం, శాంతి... ఇవన్నీ...

అవన్నీ అప్పుడు తెలియకపోయినా ఇప్పుడిప్పుడే తెలుస్తున్నాయి తనకి.

ప్రేమతో జాలితో గొర్రెపిల్లల్ని నిమురుతూ ఉంటుంది తను.

ఆ రోజు తనకి బాగా గుర్తు.

''అయ్యిచ్చిండు మీకు!'' అంటూ తాటాకు దొప్పతో అందించింది గొర్రెపోతు మాంసం.

''ఏమిటది?'' అంటూ అదోలా మొహంపెట్టి దూరంగా విసిరికొట్టాడు దాన్ని.

భయంతో బిగుసుకుపోయింది తను.

''నేను ఇలాంటి తిండి తినను. ఎవరు తిన్నా నాకిష్టం ఉండదు. ఎవరైనా జీవులపై కారుణ్యం చూపించాలి. కాని... కాని... వాటిని కోసుకు తినకూడదు!'' అన్నాడు.

అది మొదలు తను అలాంటి తిండి తినలేదు. అయ్యా, అమ్మా తిట్టారు కొట్టారు. గుంటా బలం ఎట్టా వొత్తాదే బర్రెల్ని, గొర్రెల్ని తినకపోతే? అంటూ.

కాని మొండి పట్టు విడవలేదు చంద్రి.

అసలు రావసిలకడు వాట్నీ పెంచి పెద్ద చేసేదే మాంసం కోసం.

బుడువూరులో శుక్కురోరం సంతలో గొర్రెపిల్లల్ని కొని, బాగా మేపి వెయ్యికి, రెండువేలకీ అమ్ముతూ ఉంటాడు.

రావసిలకడికి చంద్రి వొక్కతే కాదు సంతానం. ఇంకా ఇద్దరున్నారు సుబ్బి, రామి.

''ముగ్గురాడ బిడ్డల్ని ఎట్టా పెంచాల్రా దేవుడా?'' అంటూ గోలపెడుతూ వుంటుంది ఎల్లి.

'ఆడబిడ్డలయితే ఏటయినాదో అమ్మకి?' అనుకుంటూ వుంటుంది చంద్రి.

ప్రతిసారి గొర్రెపిల్లల్ని తెచ్చినప్పుడు చెప్తూ వుంటాడు రావసిలకడు. ''ఒలే సెంద్రీ ఈట్నీ బాగా మేపే! బాగా డబ్బొత్తాది! ఇప్పటికి ఎమ్మేలు జాగరత సేసినాను! మరి కొంత కూడెడితే మా సూరప్ప కొడుక్కి కట్నం ఇచ్చి నీ పెళ్లి సేత్తాను'' అని.

రావసిలకడి అప్ప సూరమ్మ. దానికో కొడుకున్నాడు. వాడికి చంద్రినిచ్చి చెయ్యాలని రావసిలకడి ఉద్దేశం.

ఒరే తమ్ముడూ దగ్గిర సంబంధం అని కట్నం ఎగ్గొడతావో ఏటో? పదేలిత్తేగాని సెందిరి న్నాకోడల్ని సేసుకోను! ఏటనుకున్నావో ఏటో?'' అంటుంది సూరమ్మ.

సూరమ్మ కొడుకు పసువుల్ని మేపుతాడు.

ఇదంతా వింటూ వుంటే చంద్రి మనసు అదోలా అయిపోతుంది.

అనుకోకుండా సత్యం మేష్టారికి బదిలీ అయిపోయింది. వెళ్తూ వెళ్తూ అన్నాడాయన.

''చంద్రీ నీకెప్పుడయినా రావాలనిపిస్తే నా దగ్గరికి వచ్చెయ్! హాస్టల్లో చేర్పించి చదివిస్తాను'' అని.

కన్నీటితో వీడ్కోలిచ్చింది సత్యం మేష్టారికి.

ఆయన మాటలు మరచిపోలేదు చంద్రి.

సత్యం, అహింస, జీవకారుణ్యం, శాంతి... ఇంకా... ఎన్నో...

రోజులు దొర్లిపోతున్నాయి.

అప్పుడప్పుడు సత్యం మేష్టారి దగ్గరనించి ఉత్తరాలు వొస్తున్నాయి.

రాత్రిపూట చెల్లెళ్ళిద్దర్నీ కూచోబెట్టుకుని మేష్టారు చెప్పిన గౌతమబుద్ధుడు, గాంధీ, నెహ్రూ ఇంకా ఎందరో గొప్పోళ్ళ కథలన్నీ చెప్తూ వుంటుంది.

''ఒలే సుబ్బీ! ఒలే రావీ మాట్టారు శానా మంచోరే!'' అంటూంటుంది తన సహజ ధోరణిలో.

వాళ్ళిద్దరూ ఆసక్తిగా వింటారు.

''ఓ లప్పా అయితే గొర్రెపిల్లల్ని కూడా సంపకూడదా? మరి అయ్య ఆట్నీ సంపెత్తాడెందుకు?'' అంటూ ప్రశ్నిస్తారు వాళ్ళిద్దరూ.

''అయ్యకి తెలవదు?'' అంటూ ఏదో ఆలోచనలో పడిపోతుంది చంద్రి.

చంద్రి గొర్రెల్ని మేపుతూనే ఉంది. అవి ఎక్కడికైనా పోతే అయ్యచేత దెబ్బలు తింటూనే ఉంది.

'సీ ఎదవజనమ!' అని ఎన్నోసార్లు అనుకుంది చంద్రి.

'ఇట్టాటి బతుకు బతక్కపోతేనేం?' ఒక్కోసారి ఏడుపు ముంచుకొస్తుంది చంద్రికి.

ఆ రోజు రావసిలకడు ఉత్సాహంగా ఇంటికొచ్చాడు. వస్తూనే అన్నాడు. ''ఒలే గుంటా సెందిరీ! మన అదురుట్టం పండినాదే! ఇన్నాళ్ళూ నువ్వు మేపిన నాలుగొర్రెలకి మంచి గిరాకీ వొచ్చినాదే! మరో వారంరోజులు ఈట్నీ బాగా మేపే! నాలుగేలొత్తాయే నాలుగేలు!''

అర్థంకానట్టు చూసింది చంద్రి తండ్రివైపు.

''ఏటే ఎర్రిమొకవా అట్టా సూత్తుండావు? వోరంరోజుల్లో పెసిడెంటుగారింట్లో పెద్దోళ్ళందరికీ బోయినా లెడతారంట! అప్పుడు ఈట్నిత్తే ఆళ్ళకి వొండిపెడతారంట!''

చంద్రి మనస్సు కలుక్కుమంది.

అయినా మాట్లాడలేదు. మౌనం వహించింది.

రోజులు భారంగా గడుస్తున్నాయి.

గొర్రెల్ని మేపుతూనే ఉంది చంద్రి.

అప్పుడప్పుడు సత్యం మాష్టారు పంపించిన పుస్తకాలు, ఉత్తరాలు అందుకుంటోంది.

సత్యం మేష్టార్ని తలుచుకున్నప్పుడల్లా దేవుడే గుర్తుకొస్తాడు చంద్రికి. సత్యం మేష్టారి బిడ్డలు పట్నంలో చదువుకుంటున్నారట! మాట్టారు సెప్తూ వుంటే ఎంతో బావుండేది' అనుకుంటుంది చంద్రి.

'సీ ఎదవజనమ!' మరోసారి అనుకుంది.

దాని అంతరంగంలో స్థిరమైన నిర్ణయం చోటు చేసుకుంటోంది.

ఆ రాత్రి హాయిగా నిద్రపోయింది చంద్రి.

★★★

అరుణ కిరణాలు లోకం అంతటా పరుచుకుంటున్నాయి.

నిద్రలేచింది చంద్రి. తడికల గదిలో స్నానం చేసింది. 'నిద్ర లేవగానే స్నానం చేయాలి చంద్రీ!' అనేవారు సత్యం మాష్టారు.

తల దువ్వుకుంది. నీలిరంగు పాలిస్టరు పరికిణీ పెద్దపెద్ద పువ్వులది కట్టుకుంది. నుదుట చాదుబొట్టు దిద్దుకుంది.

నాలుగు గొర్రెల్ని విప్పింది. మాష్టారు పంపించిన పుస్తకాలు పట్టుకుంది.

కోవెల తోటవైపుగా నడిచింది. ఓసారి రావులోరికి దణ్ణం పెట్టుకుంది.

గొర్రెలు నాలుగు పచ్చిక మేస్తున్నాయి.

వాటి మెళ్ళో రంగు గుడ్డపీలికలు వేలాడుతున్నాయి.

'అయ్యకి ఇదో సరదా! పైగా తప్పిపోకుండా వుంటాయంటాడు.'

వీటిని కొన్న దగ్గిరనించీ తనే మేపుతోంది. శుక్రవారం సంతలో బుడువూరులో అయ్య చిన్నపిల్లల్ని కొని తెచ్చాడు.

''అప్పుడియి ఎంతో ముద్దుగుండేవి!' అనుకుంది చంద్రి.

మరోసారి గొర్రెల వైపు చూసింది చంద్రి. నాలుగురోజుల్లో ఇయి ప్రెసిడెంటుగారింటి భోజనాలుగా మారిపోతాయి!

జాలి ముంచుకొచ్చింది చంద్రికి.

కళ్ళు నీటితో నిండుకున్నాయి.

ఒక్కసారి లేచింది చంద్రి. చిన్నకర్రతో గొర్రెల్ని అదిలించింది. అవి నడక అందుకున్నాయి.

వాటివెంట నడుస్తోంది చంద్రి.

ఊరికి మూడు మైళ్ళ దూరంలో చిన్న రైల్వేస్టేషనుంది. అటువైపుగా నడిచింది.

రైలు పట్టాలు జెర్రిగొడ్డలా భూమ్మీద పరచుకుని ఉన్నాయి.

రైలు స్టేషన్లోకి వచ్చి ఆగింది.

అది రోకలిబండలా ఉంది.

సత్యం మేష్టారు చెప్తూ వుండేవారు. వోరో మహానుభావుడు రోకలిబండను జూసే రైలుబండిని కనిపెట్టినాడంట!

చిన్న నవ్వు వెలిగింది చంద్రి పెదాల మీద.

రైలు పట్టాలకి కొంచెం దూరంలో పచ్చి... కనిపిస్తున్నాయి.

రైలు పట్టాలు దాటింది చంద్రి గొర్రెలతోసహా.

వాటి మెడలో రంగు గుడ్డపీలికల్ని ఊడదీసింది.

ప్రేమతో వాటి ఒడలు నిమిరింది.

వాటిని ఒక్క అదిలింపుతో దూరంగా ... పచ్చికబీళ్ళ వైపుగా తోలింది.

అవి ఆనందంతో పరుగు లంకించుకున్నాయి.

స్టేషన్ వైపుగా నడిచింది చంద్రి.

బండి కదలడానికి సిద్ధంగా ఉంది.

చంద్రి గబగబ నడిచి బండెక్కింది.

సత్యం మేష్టారు పంపిన అడ్రసు కాగితాన్ని ఓసారి చూసి పదిలంగా దాచుకుంది.

కిటికీ దగ్గర చోటు చూసుకు కూచుని ఓసారి బైటికి చూసింది.

గొర్రెలు ఎక్కడా కనిపించలేదు.

'గొర్రెలు పారిపోయాయి' అనుకుంది చంద్రి విశ్రాంతిగా సీటుకి చేరబడుతూ.

దానికి భవిష్యత్తు రంగుల హరివిల్లులా కనిపిస్తోంది. ★